

...ప్రజాక్షేత్రంలో ఎండగడదాం

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు సూచించారు.

10లో



సిలువ యాత్రకు వేళాయె..!


జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

8లో

గరిష్టం / కనిష్టం
37° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ ఉక్కపోతగా ఉండవచ్చు



న్యూస్‌రీల్

ఘనంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల నేపథ్యంలో నిలిపివేసిన నిత్యకల్యాణాలను గురువారం తిరిగి ప్రారంభించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. హనుమాన్ మాలధారులు, భక్తులు స్వామి వారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. విజయపురి కాలనీ కొత్తపేటకు చెందిన పులసాని సుగుణ, మేఘనాథ్ రెడ్డి లక్ష రూపాయలను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

చంద్రుగొండ : జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నడుస్తున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్‌జోసఫ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కూడా పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రధాన సెంటర్‌కు సమీపంలో పరీక్షకేంద్రం ఉండటంతో పరిసర ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలను మూసివేయించారు. డీఎస్పీ వెంట జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు జేఈఈ మెయిన్స్ ప్రశాంతం



అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: జాతీయ ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్ష తొలిరోజు గురువారం అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించగా, ఉదయం 70 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 60 మంది హాజరయ్యారు. సాయంత్రం జరిగిన పరీక్షకు 68 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి గంటన్నర ముందుగానే లోపలికి అనుమతించారు.

పుంజుకున్న రెండో వారధి

భద్రాచలం వద్ద గోదావరి బ్రిడ్జి నిర్మాణంలో పురోగతి

- పనుల్లో జాప్యంతో నిర్మాణ సంస్థను తొలగించిన అధికారులు
- పనుల నిర్వహణ బాధ్యత చేపట్టిన జాతీయ రహదారుల శాఖ
- మరో రెండు నెలల్లో కొత్త వంతెన అందుబాటులోకి వచ్చే అవకాశం





చివరి దశకు చేరిన భద్రాచలం రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు (ఇన్‌సెట్) ప్రారంభోత్సవ శిలాఫలకం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నదిపై చేపట్టిన రెండో వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు వేగం పుంజుకున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తై వారధి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పనుల్లో తీవ్ర జాప్యం చేస్తుండగా జాతీయ రహదారుల శాఖ(ఎన్‌హెచ్) అధికారులు నిర్మాణ బాధ్యత నుంచి కాంట్రాక్ట్ పొందిన సంస్థను తొలగించారు. అధికారులే స్వయంగా పనులు చేయిస్తుండటంతో నిర్మాణంలో పురోగతి కనిపిస్తోంది.

ఆది నుంచీ అవాంతరాలే..

నిర్మాణ సమయంలో రెండు పిల్లర్లు నాణ్యతా లోపంతో ఒంగిపోయాయి. దీంతో వాటిని కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా సరిచేశారు. అనంతరం కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పనులు మరో రెండేళ్లు నిలిచిపోయాయి. బిల్లులు కూడా రాకపోవడంతో సంస్థ నిర్మాణ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. పనుల్లో జాప్యం జరుగుతుండటంతో జాతీయ రహదారుల శాఖ నిర్మాణ సంస్థకు రూ.6.5 కోట్ల జరిమానా విధించింది. కరోనా వైరస్ వ్యాప్తి తర్వాత సిమెంట్, ఐరన్ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో కార్మికులకు పనులకు రావడం మానేశారు. అలా ఒక్కోటి నిర్మాణ సంస్థపై భారం పడటంతో పనులు మరోసారి ఆగిపోయాయి.

కేంద్ర మంత్రికి ఎంపీ, ఎమ్మెల్యే విన్నపం..

పనుల్లో జాప్యంపై మహబూబాబాద్ ఎంపీ కవిత, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య వేర్వేరుగా ఢిల్లీ వెళ్లి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీకి వినతి పత్రం అందజేశారు. ఆగిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని కోరగా.. కేంద్ర మంత్రి ఆదేశాలతో జాతీయ రహదారుల శాఖ అధికారులు నిర్మాణ సంస్థపై మరోసారి ఒత్తిడి తెచ్చారు. గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించడంతో మళ్లీ పనులను మొదలు పెట్టారు.

2015లో ప్రారంభం

గోదావరిపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి జాతీయ రహదారుల శాఖ రూ.100 కోట్ల అంచనా విలువతో టెండర్లు పిలువగా ముంబైకి చెందిన రాజ్‌దీప్ సంస్థ రూ.65 కోట్లకు పనులను దక్కించుకుంది. నిర్మాణ పనులు 2014లో ప్రారంభం కావాల్సి ఉండగా, అనుమతుల్లో జాప్యం జరగడంతో 2015 ఏప్రిల్ 1న ప్రారంభించారు. మొత్తం 36 పిల్లర్లు, 12 అడుగుల వెడల్పు, ఇరువైపులా 5 అడుగుల ఫుట్‌పాత్ నిర్మించేలా డిజైన్ రూపొందించారు. ఒప్పందం ప్రకారం 2016లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. సిబ్బంది కొరత, వరదలు, సాంకేతిక లోపాలు, కరోనా తదితర అవాంతరాలు ఎదురవడంతో ఎనిమిదేళ్లు గడిచినా బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదు. పనుల్లో తీవ్ర జాప్యం చేస్తుండటంతో జాతీయ రహదారుల శాఖ పలుమార్లు నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేసింది. పనులు పూర్తి చేసేందుకు మూడుసార్లు గడువు పొడిగించింది. అయినా నిర్మాణం పూర్తికాలేదు.

ఎన్‌హెచ్ అధికారులు బాధ్యత చేపట్టాక..

కొద్దిరోజుల తర్వాత మళ్లీ జాప్యం చేయడంతో పనుల నుంచి నిర్మాణ సంస్థ రాజ్‌దీప్ కంపెనీని తొలగించారు. జాతీయ రహదారుల శాఖ అధికారులే నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. దీంతో పనులు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు 85 శాతం పనులు జరగ్గా, మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని జాతీయ రహదారుల శాఖ అధికారులు చెబుతున్నారు. పిల్లర్ల నిర్మాణ పూర్తికాగా, మిగిలిన పిల్లర్లపై గెడ్డర్లు పెట్టి స్లాబ్ పోసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భద్రాచలం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. సారపాక వైపు 800 మీటర్ల మేరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

రెండు నెలల్లో పూర్తి..

గోదావరిపై రెండో వంతెన నిర్మాణ పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ రహదారుల శాఖ అధికారుల సమన్వయంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల సూచనలతో పనులు ముమ్మరంగా చేయిస్తున్నాం.

–శైలజ, డీఈ, జాతీయ రహదారుల శాఖ

'సింగభూపాలెం'లో సభ్యత్వాల లొల్లి

- మత్స్య సొసైటీలో ఇప్పటికే 526 మంది సభ్యులు
- తమకూ సభ్యత్వం కావాలని మరో 100 మంది పట్టు
- నిబంధనల ప్రకారం ఉండాల్సింది 250 మందే..



సింగభూపాలెం చెరువు

సుజాతనగర్: మండల పరిధిలోని సింగభూపాలెం చెరువు మత్స్య సొసైటీలో సభ్యత్వాల లొల్లి నెలకొంది. ఇప్పటికే ఈ సొసైటీలో 526 మంది సభ్యులు ఉండగా మరో కొందరు మత్స్యకారులు తమకూ సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో జారీ చేసిన సభ్యత్వాల్లో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు వ్యక్తమవుతుండగా, ఇంకా 100 మంది సభ్యత్వం కావాలని పట్టుబడుతుండటంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

రెండు మండలాల పరిధిలో చెరువు..

జూలూరుపాడు, సుజాతనగర్ రెండు మండలాల పరిధిలో సింగభూపాలెం చెరువు విస్తరించి ఉంది. నీటి పారుదల శాఖ గణాంకాల ప్రకారం చెరువు లోతట్టు విస్తీర్ణం 1,234 ఎకరాలుగా ఉంది. జూలూరుపాడు మండల పరిధిలో సుమారు 800 ఎకరాలు, సుజాతనగర్ మండల పరిధిలో సుమారు 450 ఎకరాల మేర విస్తీర్ణం ఉంది. ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్)1,058 ఎకరాల మేర ఉంది. సాధారణంగా ప్రతి ఏటా మార్చి నుంచి చేపలు పడుతుంటారు. ఆ సమయానికి నీటి నిల్వ సామర్థ్యం సుమారు 600 ఎకరాలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం రెండున్నర ఎకరాలకు ఒకరు చొప్పున సుమారు 250 మంది మత్స్యకారులకే సభ్యత్వం ఇవ్వాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా 526 మందికి సభ్యత్వం ఇచ్చారు. వల వేయడం, వల అల్లడం, ఈత కొట్టడంలో నైపుణ్యం ఉన్నవారికే సభ్యత్వం ఇవ్వాల్సిఉండగా, ఇప్పుడున్న సభ్యుల్లో చాలా మంది సభ్యులకు ఈత కూడా రాదని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు 2 ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్నవారే సభ్యులుగా అర్హులు కాగా, 10 నుంచి 20 ఎకరాల భూమి ఉన్న వారికి సైతం సభ్యత్వం ఇచ్చారనే ఆరోపణలు వినపడుతున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి చాలా మంది అనర్హులు సైతం సభ్యత్వం పొందినట్లు తెలుస్తోంది.

రూ.3 వేల వరకు వసూళ్లు

మత్స్యకారుల ఉపాధికి చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్షల సంఖ్యలో చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం వదలిన చేప పిల్లలు నాణ్యమైనవి కాదని, వాటి ఎదుగుదల సరిగా ఉండదని సభ్యులు పేర్కొంటున్నారు. ఒక్కో సభ్యుడి నుంచి రూ. 3 వేల వసూళ్లు చేసి చేప పిల్లలు కొనుగోలు చేసి పెంచుతున్నామని చెబుతున్నారు. చెరువు లోతట్టు విస్తీర్ణం 1,234 ఎకరాలు కాగా ఇందులో 30 శాతం మేర ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఆక్రమణలపై అటు రెవెన్యూ అధికారులు, ఇటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణలను తొలగిస్తే నీటినిల్వ సామర్థ్యం పెరిగి మరి కొందరు సభ్యత్వం పొందే అవకాశం ఉంటుంది.

అర్హులకే సభ్యత్వం ఇవ్వాలి



సింగభూపాలెం చెరువులో నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వం పొందిన వారు చాలా మంది ఉన్నారు. 10 నుంచి 20 ఎకరాల భూమి ఉన్న వారికి, ఈత రాని వారికి కూడా సభ్యత్వం ఇచ్చారు. నిబంధనల మేరకు సభ్యత్వం ఇవ్వాలి.

– వజ్జా శ్రీను, మేడేపల్లి

గ్రామస్తులకే మొదటి ప్రాధాన్యత



వర్షాకాలంలో వరదలు వచ్చిన సమయంలో నీటి ప్రవాహం కారణంగా సింగభూపాలెం గ్రామస్తులు మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటలు కూడా ముంపునకు గురవుతున్నాయి. అందువల్ల మరో 20 మందిని సింగభూపాలెం గ్రామస్తులకు సభ్యత్వంలో చోటుకల్పించాలి

– బూరుగు విజయబాబు, సింగభూపాలెం

ప్రధాని సభకు ప్రత్యేక రైలు..

చుంచుపల్లి: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ఈసందర్భంగా జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటుచేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు మణుగూరు నుంచి శుక్రవారం రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా నుంచి 1,500 మంది

- హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలింపు
- కలెక్టర్ అనుదీప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లో ఈ నెల 14న జరిగే డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు జిల్లాలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఐదు నియోజకవర్గాల నుంచి 1,500 మందిని పంపనున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలో గురువారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ, గొర్రెల పంపిణీ, పంచాయతీరాజ్, ఎస్సీ అభివృద్ధి శాఖ, రవాణ, ఆర్టీసీ, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి 300 చొప్పున ఎంపిక చేసే బాధ్యతను జెడ్పీ సీఈఓ, డీపీఓ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలకు బస్సులను పంపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. 14న మధ్యాహ్నం ఒంటిగంటకు నూతన సెక్రటేరియట్ చేరుకోవాలని తెలిపారు. ఇక్కడి నుంచే వెళ్లేవారికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల ఏర్పాటుకు ఇద్దరు జిల్లా అధికారులు, ఇద్దరు తహసీల్దార్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. బస్సుల పర్యవేక్షణకు ఇద్దరు అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఇద్దరు డ్రైవర్లను కేటాయించాలని, బస్సుల ఫిట్‌నెస్‌ను ఆర్టీఓ తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీ సమాచారాన్ని పశుసంవర్ధక శాఖాధికారిని అడిగి తెలుసుకున్నారు. కాగా తొలుత రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ అనుదీప్ హాజరయ్యారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, ఎస్సీ అభివృద్ధి అధికారి ఎం.రామ్మూర్తి, ఎంవీఐ జైపాల్‌రెడ్డి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్టీసీ డీఎంలు బీవీ రావు, బి.రామారావు, మున్సిపల్ కమిషనర్లు రఘు, శ్రీకాంత్, అంకుషావలి, డీఆర్వో అశోక చక్రవర్తి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు 39 గ్రామాల దత్తత

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా జిల్లాల వారీగా చేపట్టిన దత్తత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అధికారులు 39 గ్రామాలను దత్తత తీసుకున్నారు. కొత్తగూడెం డివిజన్‌లో 28, భద్రాచలం డివిజన్‌లో 11 గ్రామాలను దత్తత తీసుకున్నట్లు విద్యుత్ ఎస్ఈ కె.రమేష్ గురువారం తెలిపారు. ఆయా గ్రామాలలో ఉన్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు.

వైభవంగా చండీహోమం



చండీ హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం చండీహోమం జరిపారు. మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు అమ్మవారి, స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజల అనంతరం చండీహోమ పూజలు చేశారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో 19 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, అర్చకులు వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

వేసవి సెలవులు వస్తున్నాయి..


పార్కులు ఎట్లున్నాయి..?

- తుప్పుపట్టి, విరిగిపోయిన ఆట వస్తువులు
- పట్టణ ప్రకృతి వనాల్లోనూ అదే పరిస్థితి
- ఇంకా ప్రణాళిక దశలోనే నూతన పార్కు
- వేసవి సెలవుల్లో పిల్లలకు వినోదం లేనట్టేనా..?



మున్సిపాలిటీలోని బూడిదగడ్డ రాజీవ్ పార్కులో తుప్పు పట్టి, విరిగిపోయిన ఆట సామగ్రి

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెల 13వ తేదీ పదో తరగతి వార్షిక పరీక్షలు కూడా పూర్తికానున్నాయి. 20వ తేదీలోగా 1 నుంచి 9వ తరగతి పరీక్షలు సైతం పూర్తవుతాయి. ఇక వేసవి సెలవుల్లో సాయంత్రం వేళ సరదాగా పార్కులకు వెళ్లి ఆడుకోవచ్చని విద్యార్థులు ఇప్పటి నుంచే సంబరపడుతున్నారు. కానీ వారికి ఆనందం, ఆహ్లాదం పంచేస్థితిలో పార్కులు లేవు. ముఖ్యంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్కుల్లో చిన్నారులు ఆడుకునేందుకు సదుపాయాలు లేవు. ఆట వస్తువులన్నీ తుప్పు పట్టి, పనికి రాకుండా కనిపిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు కూడా సక్రమంగా లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. పార్కుల్లో, వార్డుల్లోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు కూడా పనిచేయడంలేదు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దాదాపు రూ.8 నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు వృథాగా పడి ఉంటున్నాయి.



పని చేయని మరుగుదొడ్లు..

మున్సిపాలిటీలోని బూడిదగడ్డ ప్రగతి మైదాన్‌కు పక్కన ఉన్న రాజీవ్ పార్కులో ఆట సామగ్రి తుప్పు పట్టి ఉంది. పిల్లలు ఆడుకుంటే గాయాలయ్యే అవకాశం లేకపోలేదు. వాకింగ్ ట్రాక్ కూడా లేదు.పచ్చదనం కోసం మొక్కలు పెంచుతున్నా పిల్లల ఆట సామగ్రిపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. పార్కులో ఉన్న బాత్‌రూంలు కూడా పని చేయడం లేదు. బస్టాండ్ సెంటర్‌లోని సింగరేణి చిల్డ్రన్ పార్కులో కూడా అదే పరిస్థితి నెలకొన్నది.

చర్యలు తీసుకుంటాం



కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్కులలో పిల్లలకు ఆట సామగ్రి ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. వేసవి సెలవుల్లో ఎక్కువగా పార్కులకు పిల్లలు వారి తల్లిదండ్రులు వస్తుంటారు కనుక సౌకర్యాలు ఉండే విధంగా చూస్తాం. దీంతో పాటుగా పట్టణ ప్రకృతి వనాల్లో కూడా సౌకర్యాలు మెరుగుపరుస్తాం.


–జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

ఇక పట్టణ ప్రకృతి వనాల దుస్థితి కూడా ఇలాగే ఉంది. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు లేవు. వాకింగ్ ట్రాక్‌లలో చెట్లు పెరిగి, నడవడానికి వీలు లేకుండా మారాయి. బల్లలు కూడా ఒకటి, రెండే ఉండటంతో సందర్శకులు కనీసం కూర్చొని సేద తీరే పరిస్థితి లేదు. పాతకొత్తగూడెంలోని పట్టణ ప్రకృతి వనంలో సౌకర్యాలు కరువయ్యాయి.



పాతకొత్తగూడెం పట్టణ ప్రకృతి వనంలోని వాకింగ్ ట్రాక్ దుస్థితి

ప్రారంభంకాని నూతన పార్కు పనులు



నిధులు కేటాయించినా పనులు చేపట్టని నూతన పార్కు స్థలం

జిల్లా కేంద్రంలో ఆకర్షణీయంగా పార్కు నిర్మించేలా మున్సిపల్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం గతేడాది అక్టోబర్‌లో రూ.20 లక్షలను పట్టణ ప్రగతి నిధుల నుంచి కేటాయించారు. రైల్వే అండర్ బ్రిడ్జిపై ఉన్న ఖాళీ స్థలంలో పార్కు నిర్మించాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభంకాలేదు. ఇంకా పార్కు డిజైనింగ్ వర్కే కొనసాగుతోందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. నూతన పార్కు ఈ వేసవికి అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులు, పట్టణ ప్రకృతి వనాల్లో క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచాలని, వాకింగ్ ట్రాక్‌లు, బాత్‌రూంలు ఏర్పాటు చేయడంతోపాటు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించనున్న ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

భద్రాచలం అధ్యాపకుడికి డాక్టరేట్


అంగడాల శ్రీను

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్రం ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్న చర్ల మండలానికి చెందిన అంగడాల శ్రీనుకి డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ జంతుశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ జి.మారుతి పర్యవేక్షణలో ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మల్బరీ సాగు, ఫలితాలపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్యతోపాటు అధ్యాపకులు శ్రీనును అభినందించారు.

టికెట్ తీసుకోమన్నందుకు టీవీ ధ్వంసం

కొత్తగూడెంఅర్బన్: ఆర్టీసీ బస్సులో ఎక్కిన వారిని టికెట్ తీసుకోమన్నందుకు, బస్సులో ఉన్న టీవీని పగలగొట్టిన సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను త్రీటౌన్ ఎస్సై సోమేశ్వర్ తెలిపారు. పట్టణంలోని గణేష్ టెంపుల్ ఏరియాకు చెందిన నేరచరిత్ర కలిగిన జగడం సాయితో పాటు మరో నలుగురు హైదరాబాద్ నుంచి భద్రాచలానికి వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సును కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఏరియాలో పాల్వంచ వెళ్లేందుకు బస్సు ఎక్కారు. ఈ క్రమంలో డ్రైవర్ కమ్ కండక్టర్ కూసపాటి యాదగిరి పాల్వంచ వెళ్లేందుకు ఒక్కరికి రూ.50 అవుతుందని చెప్పగా.. టికెట్ ధర అంత ఎందుకు అవుతుందని వారు యాదగిరితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో రఫి అనే వ్యక్తి బస్సులో ఉన్న టీవీని తన చేతి కడియంతో ధ్వంసం చేయగా.. డ్రైవర్ త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో జగడం సాయి, రఫి, ఇమ్రాన్ మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

సుజాతనగర్: అక్రమంగా మట్టి తోలకాలు జరిపిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని రాఘవాపురంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా మట్టి తోలకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేసి నాలుగు మట్టి ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం వాటిని తహసీల్దార్‌కు అప్పగించగా.. రూ.34 వేల జరిమానా విధించారు.

మా పొలాల నుంచి లారీలు తిరగొద్దు..


లారీలను అడ్డుకున్న రైతులు

చర్ల: పంట పొలాలకు వెళ్లే దారికి పక్కన ఉన్న సాగు భూముల్లో గొల్లగూడెంలో చేపట్టిన సీతమ్మసాగర్ పనుల నిమిత్తం లారీల రాకపోకల కోసం గ్రావెల్ పోశారు. దీంతో బాధిత రైతులు గురువారం తమ పంటలకు నష్టం కలిగిస్తున్నారని లారీలను అడ్డుకుని తమకు తక్షణమే పంట నష్టం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. తమకు కనీస సమాచారం లేకుండా తమ పట్టా భూముల మీదుగా ఉన్న రహదారికి గ్రావెల్ పోసి ఆ దారి మీదుగా లారీలను ఎలా నడుపుతారంటూ గ్రామానికి చెందిన 29 మంది గిరిజన రైతులు సీతమ్మసాగర్ పనులు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. దీంతో కంపెనీ సూపర్‌వైజర్ పై అధికారులతో మాట్లాడిన అనంతరం జరిగిన నష్టం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎలకం రామకృష్ణ, కాకా కామరాజు, కోరం బాబు, ఎలకం శ్రీను, కారం సీతయ్య, కాకా జగపతిరావు, కాకా నాగేశ్వరావు, ఎలకం చినబూషణం, కాకా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి యత్నం

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.జయరాజు లైంగిక దాడికి యత్నించాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై బుధవారం రాత్రి జయరాజు లైంగిక దాడికి యత్నించగా.. గురువారం బాధితురాలి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

సిలువ యాత్రకు వేళాయె..!

పాప విముక్తి కోసమే ఏసుక్రీస్తు సిలువ యాగం

- నేడు శుభ శుక్రవారం(గుడ్ ఫ్రైడే)
- శ్రమదినాలకు స్వస్తి పలకనున్న క్రైస్తవులు
- 9న ఈస్టర్ పండుగ
- ముస్తాబైన క్రైస్తవ మందిరాలు


సుంకరగూడెంలోని చర్చి

ఇల్లెందురూరల్: మంచికి దూరంగా.. అత్యాశ, పాపపు పనులతో అసత్య మార్గంలో వెళ్తున్న ప్రజల పాప పరిహారార్థం వారిలో మానవత్వం, మంచితనం నింపేందుకు ఏసుక్రీస్తు సిలువ యాగం చేశారని బైబిల్ చెబుతోంది. ఏసుక్రీస్తు సిలువకు ముందు ఎంతో మంది కరుడుగట్టిన నేరస్తులు సిలువకు వేలాడి శిక్షను అనుభవించి మరణించారు. కానీ, నిరపరాధి అయిన ఏసు సిలువకు వేలాడటంతో దాని అర్థమే మారిపోయింది. ఏసుక్రీస్తు సిలువ.. ప్రేమకు, త్యాగానికి, పరలోకార్హత పొందడానికి ప్రతీకగా మారింది. పాపం చేసిన వారిని శిక్షించడం కన్నా.. మనిషిలోని పాపాన్ని సిలువ వేయాలని.. ఈ క్రమంలో మనిషి ప్రేమ, క్షమ, కరుణ, మూర్తీభవించిన క్రీస్తు ప్రభువులో పునరుత్థానం చెందుతాడు. ఇదే 'శుభ శుక్రవార పర్వదినం'అందించే శుభ సందేశం.

ముగియనున్న ఉపవాస దీక్షలు..

ప్రార్థన, ప్రాయశ్చిత్తం, ఉపవాస దీక్షలు.. ఇదీ నలభై రోజుల ఉపవాస దీక్షల సారాంశం. సర్వమానవాళి పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు లోకానికి వచ్చి సిలువపై మరణించాడని బైబిల్ చెబుతోంది. సిలువ వేయక ముందు ఏసు అనుభవించిన శ్రమలను ఈ ఉపవాస రోజుల్లో క్రైస్తవులు ధ్యానించారు. దైవ కుమారిడిగా శ్రమలను జయించే శక్తి ఉన్నా.. మానవుడి మాదిరిగా జీవితాన్ని చూపడానికి శ్రమలను ఎదుర్కొన్నారనే విషయం స్మరించుకున్నారు. ఉపవాస దీక్షలతో కోరికలను అణచుకోవడం, తన పాపాల నుంచి క్షమాపణను కోరుకోవడం.. ఇలా నలభై రోజులపాటు భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలను గుడ్‌ఫ్రైడే (శుభ శుక్రవారం) సందర్భంగా ముగిస్తారు.

9న ఈస్టర్ పండుగ..

ప్రభువైన ఏసుక్రీస్తు సజీవుడిగా తిరిగి లేచిన శుభ సందర్భాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేకమైన వంటకాలు చేసుకొని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కాగా, సిలువపై ఏసుక్రీస్తు క్షమాపణ, రక్షణ, ఆదరణ, శ్రమ, అన్వేషణ, సంపూర్ణత, నిత్యజీవం అనే ఏడు మాటలు పలికారని, అవి మానవ మనుగడకు సూచికల వంటివని మత పెద్దలు చెబుతుంటారు.

ఏసు మాటలు అనుసరణీయం..



సిలువపై నుంచి ప్రభువైన ఏసుక్రీస్తు చెప్పిన ఏడు మాటలు మానవ మనుగడకు సూచికలు వంటివి. జీవనయానంలో తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన గౌరవం, సంతానం పట్ల తల్లిదండ్రులు చూపాల్సిన దయాగుణం.. తోటివారికి చేయూత నివ్వడం.. వంటి గొప్ప సందేశాలు ఏసుక్రీస్తు ఇచ్చారు.

– దేవిడ్‌రాజు, పాస్టోరేట్ చైర్మన్, మామిడిగూడెం, ఇల్లెందు మండలం

భక్తిశ్రద్ధలతో ఆచరిస్తాం..



శుభ శుక్రవారానికి నలభై రోజుల ముందు నుంచి ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నాం. సిలువ వేయక ముందు ఏసు అనుభవించిన శ్రమలను ఉపవాస రోజుల్లో ధ్యానించుకున్నాం. సిలువపై నుంచి ఏసుక్రీస్తు చెప్పిన ఏడు మాటలను ఆచరణలో పెట్టి నలుగురికి సహాయపడతాం.

– కొత్వాల అర్పిత, సుంకరగూడెం, ఇల్లెందు మండలం

గొయ్యి తీశారు..పూడ్చటం మరిచారు

- విధుల్లో కానరాని అధికారుల పారదర్శకత
- జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్


గ్రామ పంచాయతీ సిబ్బంది తీసిన గొయ్యి


కరకట్ట వద్దే ఉన్న పందుల కళేబరాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని డంపింగ్ యార్డు వద్ద ఉన్న పందుల కళేబరాలతో రామాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బంది పడుతుండగా.. గురువారం సాక్షి దినపత్రికలో 'రామాలయానికి సమీపంలో పందుల కళేబరాలు'అనే కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే జిల్లా ఉన్నతాధికారులు ఈ కథనానికి స్పందించి ఆదేశాలను జారీ చేయటంతో గ్రామ పంచాయతీ అధికారులు హుటాహుటిన గురువారం డంపింగ్ యార్డు ప్రాంతంలో జంతు కళేబరాలను పూడ్చేందుకు జేసీబీతో చిన్న గొయ్యి తీశారు. కానీ, అధికారులు నిర్లక్ష్య వైఖరితో గొయ్యి తీసి వదిలేశారు. దీంతో మరోసారి ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతపై గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యపు వైఖరి బయట పడింది.

ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత పట్టదా..?

గ్రామపంచాయతీ ఆధ్వర్యాన పట్టణంలోని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. కానీ ఇటీవల కాలంలో సిబ్బంది, కార్మికులు విధుల్లో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యనిర్వాహణాధికారి సైతం ఇతర పనులలో బిజీబిజీగా ఉండడంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. ప్రతి ఏడాది శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా రామాలయ పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడతారు. కానీ ఈ ఏడాది ఆ కార్యక్రమాన్ని సైతం పూర్తిస్థాయిలో అమలుపర్చలేదు. వాణిజ్య సముదాయాలు, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో డ్రెయినేజీ సమస్యలు వర్ణనాతీతం. పంచాయతీ అధికారులే ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది డబ్బులు చేతిలో పడందే డ్రెయినేజీలను శుభ్రపర్చటం కుదరదని బేరసారాలు ఆడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జంతు కళేబరాలను పూడ్చించకపోవడం వల్ల దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇంటిబాట పట్టించే బాధ్యత కుటుంబీకులదే..

ఎస్పీ డాక్టర్ వినీత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

చర్ల: మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారిని ఇంటిబాట పట్టించే బాధ్యత వారి వారి కుటుంబ సభ్యులపై కూడా ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని చర్లలోని పోలీస్‌స్టేషన్‌లో జిల్లాకు చెందిన 16 మంది మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారి వారి కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలను మావోయిస్టులు బెదిరించి పార్టీలో బలవంతంగా చేర్చుకుని బయటకు రాకుండా చేస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో మండలంలోని ఎర్రంపాడు, చెన్నాపురం, కొండెవాయి, కిష్టారంపాడు, కురకట్‌పాడు, బట్టిగూడెం, బూరుగుపాడు, రాళ్లాపురం గ్రామాలతో పాటు అశ్వాపురం మండలంలోని చింతిర్యాలకు చెందిన వారు మాత్రమే మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నారని చెప్పారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన వారికి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న 16 మంది కుటుంబసభ్యులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్, చర్ల, అశ్వాపురం సీఐలు అశోక్, శ్రీనివాస్, ఎస్సైలు వెంకటప్పయ్య, సూరి, చంద్రశేఖర్, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలి

టీవీఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు


బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరికీ ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని తెలంగాణా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం కేటీపీఎస్ ముందు ఉన్న గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, యాజమాన్యం.. చివరకు ఆర్టిజన్ అనే కొత్త పేరుతో తీసుకున్నారని ఆరోపించారు. పర్మనెంట్ ఉద్యోగి కాకుండా కాంట్రాక్ట్ కార్మికుడిగానే వెట్టిచాకిరీ చేస్తున్నామని, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగంలా మారిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం నాటి స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్‌ను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్‌సంస్థల్లో 23 వేల మంది కార్మికులను పర్మనెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నా ఆచరణలో కానరావడం లేదన్నారు. గడిచిన పీఆర్‌సీలో 10శాతం కోల్పోయామని, కోల్పోయిన పీఆర్‌సీతో కలిపి 50శాతం పీఆర్‌సీ ఆశ చూపారని, అయితే ప్రస్తుత పరిణామాలు ఆందోళనకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీఈటీయూఎఫ్‌గా ఏర్పడ్డ 24 కార్మిక సంఘాలు ఆర్టిజన్ల ప్రధాన హక్కులను గుర్తించడం లేదని విమర్శించారు. టీఎస్ జెన్‌కో అధ్యక్షకార్యదర్శులు ఉండేటి జయరాజ్, ఆవుల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్లు ఐక్యంగా హక్కుల సాధనకు ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ నెల 25న చేపట్టే సమ్మెలో పాల్గొనాలని కోరారు. కాగా సభాస్థలికి అమరుడైన కేశబోయిన నాగేశ్వరరావు సభా ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బాలకృష్ణ, పురుషోత్తం, శ్రీను, రామకృష్ణ, మసూద్, రవీందర్, నవీన్, బోగా శ్రీకాంత్, వాజీద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరుస లీకేజీలతో గందరగోళం

మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

చర్ల: తెలంగాణలో పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీతో నిరుద్యోగులు, విద్యార్థుల్లో తీవ్ర గందరగోళాన్ని కలిగిస్తున్నాయని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు. మొన్న టీఎస్‌పీఎస్‌సీ, నిన్న పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్‌ను గాలికొదిలేసిందని మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే నిరుద్యోగ సమస్య పోతుందని యువత పోరాడగా ఇప్పుడు వారి కలలు నెరవేరడంలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉన్న ఖాళీ ఉద్యోగాల్లో 80 వేల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పినా ఇది మోసపూరితమేనని జగన్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీకి కారకులైన అధికారులను తొలగించి చర్యలు తీసుకోవాలని, నూతన బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మూత్రాశయం నుంచి రాళ్ల తొలగింపు


సర్జరీ ద్వారా తొలగించిన రాళ్లు

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఎంతో కాలంగా వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతుండగా, వైద్యులను ఆశ్రయించాడు. దీంతో స్కానింగ్ చేయించిన వారు మూత్రాశయంలో మూడు పెద్ద సైజు రాళ్లు ఉన్నాయని గుర్తించారు. ఈమేరకు బుధవారం శస్త్రచికిత్స చేసి రాళ్లను బయటకు తీశారు. ఇలాంటి శస్త్రచికిత్స ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయడం అరుదని చెబుతున్నారు. వైద్యులు సోమరాజు దొర, రామకృష్ణ, అనస్తీషియన్ శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి 12 ఏళ్ల జైలు

కొత్తగూడెంటౌన్/భద్రాచలంఅర్బన్: గంజాయిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు 12 ఏళ్ల కఠిన కారాగారా శిక్షతో పాటు చెరో రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఎన్.పీ.ఎస్ యాక్ట్) పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ గురువారం తీర్పును చెప్పారు. తీర్పుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కర్రీ లక్ష్మీ అప్పలనాయుడు, కడలి రమేష్, సంగారెడ్డి జిల్లాకు చెందిన కమల్ జాదవ్ తెలుపు రంగు షిఫ్ట్ కారులో ఒరిస్సా నుంచి గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా భద్రాచలం కూనవరం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. కారును ఆపి తనిఖీ చేయగా 105 ప్యాకెట్ల గంజాయి (214.950 కిలోలు) దొరికింది. వాటి విలువ రూ.32,24,250 ఉంటుందని తెలిపి సీజ్ చేసి పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేయగా.. విచారించిన కోర్టు శిక్షను ఖరారు చేసింది. నిందితులు ఏ1 కర్రీ లక్ష్మీఅప్పలనాయుడు, ఏ2 కడలి రమేష్‌లకు 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు చెరో రూ.లక్ష జరిమానా విధించారు. ఏ3 కమల్‌జాదవ్‌పై నేరం రుజువుకాలేదని న్యాయమూర్తి తీర్పును చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ ఎన్.హరిగోపాల్, భద్రాచలం ఏఎస్సై గంజి శశిధర్‌లు సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గాయాలతో సత్తిరెడ్డి

అశ్వాపురం: మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పగిళ్ల సత్తిరెడ్డి(65) ఓ పని నిమిత్తం ఆటోలో అశ్వాపురం వెళ్లాడు. ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట కాలినడకన రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో సత్తిరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అశ్వాపురం పీహెచ్‌సీకి ఆపై భద్రాచలంకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో సత్తిరెడ్డి మృతి చెందాడు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో పడి యువకుడు..


మృతుడు సుమన్ (ఫైల్)

సుజాతనగర్: చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై సుజాతనగర్ ఠాణాలో గురువారం కేసు నమోదైంది. ఎస్సై పి.తిరుపతిరావు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంకు చెందిన బాణోత్ సుమన్(22) పశువులను మేత మేపేందుకు పశువులను తోలుకెళ్లాడు. ఇదేక్రమంలో అదే గ్రామానికి చెందిన గుగులోత్ జామ్లా, గుగులోత్ శివ అనే ఇద్దరు వ్యక్తులు కూడా పశువులను మేత కోసం తోలుకెళ్లారు. సాయంత్రం అయినా సుమన్ ఇంటికి రాకపోవడంతో గుగులోత్ జామ్లా ఇంటికి సుమన్ తండ్రి హనుమా వచ్చి తన కుమారుడు ఎక్కడ ఉన్నాడంటూ అడిగాడు. చెరువులో పడి చనిపోయాడని సమాధానం చెప్పడంతో వెళ్లి చూడగా.. చెరువులో శవమై కనిపించాడు. అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంజక్షన్ వికటించి బాలుడికి అస్వస్థత..


అస్వస్థతకు గురైన బాలుడు దీపక్

సుజాతనగర్: ఇంజక్షన్ వికటించి ఓ బాలుడు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన తుంపూరి జాన్సీ, నవీన్ దంపతుల కుమారుడు దీపక్ పదిరోజుల క్రితం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో ఊరిలోని ఓ ఆర్ఎంపీకి చూపించగా.. బాలుడికి ఇంజక్షన్ వేశాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడి శరీరంపై నల్ల మచ్చలు రావడంతో పాటు బాలుని అంగం వాపుకు గురైనట్లుగా తల్లిదండ్రులు గుర్తించి విషయాన్ని ఆర్ఎంపీకి తెలియజేయగా మరుసటి రోజు వచ్చి మరో ఇంజక్షన్ ఇచ్చాడు. కాగా, తగ్గకపోగా ఎక్కువకావడంతో ఆర్ఎంపీ వైద్యుడి సూచన మేరకు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి వారం రోజుల పాటు వైద్యం అందించారు. కొత్తగూడెంలో చికిత్స అనంతరం బాలుని జ్వరం తగ్గినా అంగానికి ఉన్న వాపు మాత్రం నయం కాలేదు. అంతేకాక అంగం వద్ద రక్తస్రావం అవుతుండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం బాలుడిని గురువారం ఖమ్మం తరలించారు. ఇంజక్షన్ ఇచ్చిన ఆర్ఎంపీని అడిగితే తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని బాలుని తల్లిదండ్రులు తెలిపారు. ఇప్పటి వరకు రూ.30 వేల వరకు ఖర్చు చేశామని, ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దమ్మపేట: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలపాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 4వ తేదీన మండల పరిధిలోని గున్నెపల్లి గ్రామంలో లంకా చిట్టియ్య (50) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పాశం ముత్యాలరావు ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురుగా వస్తున్న చిట్టియ్యను ఢీ కొట్టాడు. దీంతో చిట్టియ్యకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుమార్తె తడికమళ్ళ వరలక్ష్మి గురువారం పోలీసులు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కట్టుబట్టలే మిగిలాయి..

- అగ్ని ప్రమాదంలో నాలుగిళ్లు దగ్ధం
- సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


బాధిత కుటుంబాలతో ఆర్ఐ, సర్పంచ్, ఎంపీటీసీ

దుమ్ముగూడెం: మండలంలోని డీ–కొత్తగూడెం గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులకు కట్టుబట్టలే మిగిలాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన కారం నాగమ్మ, కారం మంగరాజు, కారం లక్ష్మీపతి, కారం వెంకటేష్‌లు ఒకే దగ్గర ఇళ్లు కట్టుకున్నారు. కాగా వారు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లగా.. మధ్యాహ్న సమయంలో కారం మంగరాజు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఈక్రమంలో పక్కనే ఉన్న ఇళ్లకు అంటుకోవడంతో ఇళ్లన్ని అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో నాలుగు ఇళ్ల నుంచి ఒక్క వస్తువును కూడా బయటకు తీసుకురాలేకపోయారు. ఇళ్లల్లోని ధాన్యం, బంగారం, వెండి, ఇంటి సామగ్రి, పుస్తకాలు, గుర్తింపు కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్స్ అన్ని కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. మరో రెండు ఇళ్లు పక్కనే ఉన్నప్పటికి గ్రామస్తులు మంటలు అంటుకోకుండా చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ ఆదినారయణ, వీఆర్ఏ గణేష్‌లు సందర్శించి పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాలను సర్పంచ్ తెల్లం రామకృష్ణ, ఎంపీటీసీ సోడి తిరుపతిరావులు పరామర్శించారు.

క్లుప్తంగా...

కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మొదలుపెడతామని చెప్పారు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారన్న ఎంపీ ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నాళ్లగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పనులను మొదలు పెడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఉత్తమ్ పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. డోర్నకల్ - నేలకొండపల్లి - కోదాడ - హుజూర్ నగర్ - నేరేడుచర్ల - మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు. దీంతో పాటే మోతమర్రి-జగ్గయ్యపేట-మేళ్లచెర్వు-మఠంపల్లి-జాన్ పహాడ్-విష్ణు పురం-మిర్యాలగూడ రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైళ్లను నడపాలని, ఈ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలని కోరారు.

వందేభారత్‌ను నల్లగొండలో ఆపుతామని హామీ

మోతుమర్రి-మిర్యాలగూడ మధ్య ప్యాసెంజర్ రైళ్లను నడుపుతామని, డబ్లింగ్ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. విశాఖ- తిరుపతి వందేభారత్‌తో పాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నల్లగొండలో ఆపేలా చర్య లు తీసుకుంటామని, మిర్యాలగూడలో ఆపే విషయంపై పరిశీలన చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను విచారించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీకేజీ అంశాన్ని పక్కదారి పట్టించే కుట్రలో భాగంగానే బండి సంజయ్ అరెస్టుతో పాటు రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. 30 లక్షల కుటుంబాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని విచారిస్తే మంత్రి కేటీఆర్ బండారం బయటపడుతుందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను సైతం విచారించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్ సిఫారసుతోనే టెక్నికల్ సర్వీసెస్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఏపీ సర్వీసులో ఉన్న ఏ2 ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీలో అక్రమంగా చొరబడి పేపర్ లీకేజీకి తెరతీశారని ఆరోపించారు. టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్ జగన్మోహన్ రావు మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడని అన్నారు. మంత్రి కేటీఆర్‌ను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అది వదిలేసి రేవంత్‌రెడ్డి, సంజయ్‌పై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్న బండి సంజయ్‌ను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

అవును.. మళ్లించాం

▶ మొదటి పేజీ తరువాయి

చట్టం తమకు వర్తించదని దబాయించడం రామోజీరావు, ఆయన కుటుంబం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. సీఐడీ అధికారులకు రికార్డులు చూపించబోమని శైలజా కిరణ్ భీష్మించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజను సీఐడీ అధికారులు గురువారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని ఆమె నివాసంలో విచారించారు. సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్, విచారణ అధికారి రవికుమార్‌లతోపాటు 25 మంది అధికారుల బృందం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. శైలజ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయవాదులతోపాటు తెలంగాణ హైకోర్టు న్యాయవాది కూడా విచారణ ప్రక్రియ సమయంలో ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన విచారణ ప్రక్రియను సీఐడీ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాదాపు 75 ప్రశ్నలకు వివరాలు రాబట్టి వాంగ్మూల పత్రంపై శైలజ సంతకం తీసుకున్నారు. గతంలో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా శైలజ నుంచి పలు కీలక విషయాలను సీఐడీ అధికారులు రాబట్టినట్టు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విచారణలో ఆమె వెల్లడించిన విషయాలు ఇలా ఉన్నాయి...

చందాదారుల సొమ్మును మళ్లించాం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీల్లో సేకరించిన పలు కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సీఐడీ అధికారులు శైలజను విచారించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను రామోజీ గ్రూపునకు చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక)- బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నైలలో అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్న విషయాన్ని ఆమెకు చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకంగా 88.5 శాతం వాటా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిటే ఉంది. ''అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాం..'అని శైలజ అంగీకరించినట్లు సమాచారం.

ఏ చట్టాలు వర్తించవు... మా చట్టం మాకుంది

చందాదారులు చెల్లించిన నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982కు వ్యతిరేకం కదా...! ఆ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం అందుకు రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలుసు కదా..? అని సీఐడీ అధికారులు శైలజను ప్రశ్నించారు. అయితే అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తనకు తెలియదని ఆమె చెప్పడంతో సీఐడీ అధికారులు విస్తుపోయారు. చిట్‌ఫండ్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మీకు అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తెలియదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ చట్టం- 1982ను తాము అనుసరించబోమని ఆమె సమాధానం ఇవ్వడంతో నివ్వెరపోవడం సీఐడీ అధికారుల వంతైంది. మరి చిట్‌ఫండ్స్ వ్యాపారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించగా.. మా చట్టాలు మాకున్నాయి... వాటి ప్రకారం చేస్తున్నాం అని ఆమె బదులిచ్చినట్టు సమాచారం.



గురువారం హైదరాబాద్‌లో శైలజా కిరణ్‌ను విచారిస్తున్న సీఐడీ అధికారులు

చట్టం అనుసరిస్తామంటూ...తెలీదంటూ

సీఐడీ అధికారులు అదే విషయంపై గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామని శైలజ పేర్కొనట్లు సమాచారం. చిట్‌ఫండ్స్ వ్యాపారానికి కంపెనీల చట్టంతో నిమిత్తం లేదని, అనుసరించాల్సింది కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం -1982 కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె సమాధానం ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. పోనీ కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నారని భావించినా... ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5 శాతం వాటాతోపాటు మరో రెండు కంపెనీల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు కదా? అని అధికారులు ప్రశ్నించడంతో అవునని ఆమె సమాధానమిచ్చారు. కంపెనీల చట్టం ప్రకారం 50 శాతానికి మించి వాటా కలిగి ఉంటే అనుబంధ కంపెనీగానే పరిగణిస్తారు కదా? అని తిరిగి ప్రశ్నించగా అందుకు కూడా ఆమె అవుననే సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది.

ఏటా రూ.వందల కోట్ల చెక్కులు..

విచారణ సందర్భంగా సీఐడీ మరో కీలక ఆధారాన్ని సేకరించింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్న రామోజీరావు, శైలజ రికార్డుల్లో మాత్రం చట్టాన్ని ఏమార్చేందుకు యత్నించారని నిరూపితమైంది. 2022 మార్చి 31న రూ.255 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్టు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ చెక్కులేవీ తరువాత నగదుగా మారినట్లు (ఎన్‌క్యాష్)గా రికార్డుల్లో లేవని సీఐడీ అధికారులు గుర్తించారు. గరిష్టంగా పది రోజుల్లో చెక్కులను నగదుగా జమ చేస్తామని శైలజ పేర్కొన్నారు. మరి గతేడాది మార్చి 31న వచ్చినట్టు చూపించిన రూ.255 కోట్ల చెక్కులేవీ నగదుగా మారినట్లు రికార్డుల్లో ఎందుకు లేవని సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజ తెల్లమొహం వేశారని సమాచారం. కొన్ని దశాబ్దాలుగా ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు రికార్డుల్లో చూపుతున్నా అవి నగదుగా మాత్రం మారడం లేదు. ఎందుకంటే ఏటా చందాదారులు చెల్లిస్తున్న రూ.వందల కోట్లను మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరిలో ఆ నిధులు ఉన్నట్లుగా చూపించాల్సి రావడంతో చెక్కులు వచ్చినట్లు చూపించి కనికట్టు చేస్తోంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు.

ఉన్నాయి కానీ.. చూపించను

లేని చెక్కులు ఉన్నట్టుగా చూపించి మోసానికి పాల్పడినట్టు నిరూపితం కావడంతో శైలజ షాక్‌కు గురయ్యారు. దాంతో సీఐడీ అధికారులను పక్కదారి పట్టించేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. 'ఆ చెక్కుల సమాచారం అంతా ప్రధాన కార్యాలయంలో ఉంటుంది... 'అని పేర్కొన్నారు.

ఏపీ రికార్డులు ప్రత్యేకంగా లేవు

చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు ఏ రాష్ట్రానికి సంబంధించిన రికార్డులు ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిర్వహించాలి. అక్కడి చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, చిట్టీల వివరాలు, ఆదాయ-వ్యయాలు, బ్యాలన్స్‌షీట్‌ను ప్రత్యేకంగా రూపొందించాలి. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, ఇతర వివరాలను తెలంగాణ, ఇతర రాష్ట్రాల రికార్డులతో పాటు కలిపి నిర్వహిస్తోంది. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రామోజీరావు కుటుంబానికి చెందిన ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతోంది.

నీళ్లు నమిలి... నీళ్లు తాగి

సీఐడీ అధికారులు నిబంధనలు పాటిస్తూ శైలజా కిరణ్‌ను విచారించారు. విచారణకు ఆమె సహకరించకపోయినా సరే ఒత్తిడి చేయకుండా ప్రశ్నలు సంధించారు. గురువారం రోజు మధ్యాహ్నం వరకు సాగిన మొదటి విడతలో చాలా ప్రశ్నలకు నాకు తెలియదు.. గుర్తులేదు...నాకు సంబంధం లేదు అంటూ ఆమె సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు. దాంతో చాలా ప్రశ్నలకు ఆమె నీళ్లు నమిలినట్టు సమాచారం. విచారణ సందర్భంగా ఆమె పలుసార్లు తనకు దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి వచ్చారు.

చూపు సరిగా లేదు.. కనిపించడం లేదు

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను ల్యాప్‌టాప్‌లో సీఐడీ అధికారులు శైలజకు చూపించారు. నిధులు మళ్లించినట్టు అందులో ఉన్న వివరాలను చూపిస్తూ అవి వాస్తవమేనా? అని అడిగారు. అయితే ఆ పత్రాలు తనకు కనిపించడం లేదని... పేర్కొనడంతో సీఐడీ అధికారులు ల్యాప్‌టాప్‌లో ఎన్‌లార్జ్ చేసి మరీ చూపించారు. 'నాకు చూపు సరిగా లేదు... ఆ పత్రాల్లో ఏముందో కనిపించడం లేదు'అని శైలజ పేర్కొనడంతో సీఐడీ అధికారులు మధ్యవర్తిగా ఉన్న ఓ వ్యక్తిని పిలిచి ఆ పత్రాలు చూపించారు. అవి తనకు కనిపిస్తున్నాయని ఆయన చెప్పడంతో పాటు అందులో ఏముందో చదివి వినిపించారు. దీంతో తనకు ఏమీ కనిపించడంలేదని తప్పించుకునేందుకు శైలజ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

సలేశ్వరం.. జనసంద్రం

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతించిన ప్రకారం లింగమయ్య దర్శనానికి శుక్రవారం చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

యంత్రాంగం ఫెయిల్...

సలేశ్వరం లింగమయ్య జాతర పూర్వం వారం పాటు జరిగేది. ఆ తర్వాత కాలంలో ఐదు రోజుల పాటు నిర్వహణకు అటవీశాఖ అనుమతి ఇవ్వగా కరోనా నేపథ్యంలో 2020, 2021లో ఉత్సవాలు రద్దయ్యాయి. ఆ తర్వాత పరిస్థితులు మెరుగుపడటంతో గతేడాది, ప్రస్తుతం మూడు రోజులకే ఉత్సవాలను అటవీశాఖ కుదించింది. దీంతో భక్తులు లక్షలాదిగా పోటెత్తారు. మరోవైపు టోల్‌గేట్ రుసుము కోసం నిర్దేశిత సమయం దాటినా వేల సంఖ్యలో వాహనాలను అనుమతించడంతో ఉదయం వెళ్లి తిరుగుపయనమైన వారు.. లింగమయ్యను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులతో దారి మొత్తం కిక్కిరిసింది. అలాగే ఆర్టీసీ బస్సుల హాల్టింగ్‌ను రాంపూర్ నుంచి పుల్లాయపల్లికి మార్చడం, మధ్యాహ్నం 3:30 గంటల తర్వాత బస్సులను నిలిపివేయడంతో భక్తులు నరకయాతన అనుభవించారు. తెలంగాణలో అతిపెద్ద సాహస యాత్రగా పేరొందిన గిరిజన జాతరకు అధికార యంత్రాంగం కనీసం ఉచిత తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని భక్తులు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా కనీస చొరవ చూపలేదంటూ దుయ్యబట్టారు.

దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగా..

లోయలోకి దిగకముందే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భయం వేసింది. ఇప్పుడు ఇబ్బంది పడేకన్నా వచ్చే ఏడాదైనా లింగమయ్యను దర్శించుకోవచ్చని.. దూరం నుంచి దండం పెట్టుకొని వెనుదిరిగాను.

- లక్ష్మి, చిన్నకొత్తపల్లి, పెద్దకొత్తపల్లి మండలం

ఒకరిద్దరే పోలీసులు

పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గం వెంట పోలీసు బందోబస్తు లేదు. లోయలోకి దిగే మార్గంలో భక్తులను అదుపు చేసే వారే కరువయ్యారు. స్నానాలు చేసే గుండం దగ్గర ఒకరిద్దరు పోలీసులే ఉన్నారు. - శివ, జగన్నాథపురం

భారీ ధరలు

క్షేత్రంలో పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయి. లీటర్ నీళ్ల బాటిల్‌ను రూ. 70కి, టెంకాయ రూ. 50కి విక్రయిస్తున్నారు. అయినా అధికారులు ఎవరూ వారిని నియంత్రించలేదు.

- రవీందర్, వనపట్ల, నాగర్‌కర్నూల్ మండలం

చేయని తప్పుకు నన్ను బలిచేశారు

- పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం ఇవ్వండి
- ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి హరీశ్ వేడుకోలు
- విద్యార్థి హాల్‌టికెట్ తీసుకుని బయటికి పంపిన హనుమకొండ డీఈవో



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్, అతని తల్లి లలిత


కమలాపూర్: చేయని తప్పుకు తనను బలిచేశారని పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఈ నెల 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన హరీశ్ గురువారం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు పరీక్షకేంద్రానికి రాగా, డీఈవో ఎండీ అబ్దుల్ హై అతని హాల్‌టికెట్ తీసుకొని బయటకు పంపించారు. అనంతరం హరీశ్ తన తల్లి లలితతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పరీక్ష కేంద్రం కిటికీ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'తమ్ముడు ప్రశ్నపత్రం ఇవ్వు' అని అడిగాడని, తాను ఇవ్వనని చెప్పి ఇన్విజిలేటర్‌కు చెబుదామనుకుంటున్న సమయంలో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపాడు. తాను బెంచీ మధ్యలోకి జరగగానే అతను వెళ్లిపోయాడని భావించి ఆన్సర్‌షీట్ మార్జిన్ కొట్టుకుంటుండగా ప్రశ్నపత్రం లాక్కున్నాడని, ఫొటోలు తీసుకుని ఆ ప్రశ్నపత్రాన్ని తన వైపు విసిరేసి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. తనను చంపుతానని బెదిరించడంతో భయపడి ఆ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. చేయని తప్పుకు తన భవిష్యత్‌ను బలి చేయకుండా హాల్‌టికెట్ ఇచ్చి యథావిధిగా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశమైనా ఇవ్వాలని ఉన్నతాధికారులను వేడుకున్నాడు. హరీశ్ తల్లి లలిత మాట్లాడుతూ తన కొడుకు భవిష్యత్‌ను పాడు చేయకుండా పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని రోదిస్తూ చేతులు జోడించి సంబంధిత అధికారులను వేడుకొంది.

సపోర్ట్ ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ఖమ్మం వైద్యవిభాగం: నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఖమ్మం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఐదు సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ మాలతి తెలిపారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల ఈహెచ్‌ఎమ్‌ఐఎస్ నివేదికలను వీరు పర్యవేక్షించాలని ఉంటుందని పేర్కొన్నారు. బీటెక్, ఎంబీఏ అర్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని, కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ ద్వారా నియామకాలు చేపడుతామని తెలిపారు. అభ్యర్థులు జిల్లా వెబ్‌సైట్ ద్వారా కానీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నేరుగా కానీ ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు అందజేయాలని సూచించారు.

పీఎం ఫెలోషిప్ అవార్డుకు మోటాపురం విద్యార్థిని



బిక్కసాని మైత్రి

నేలకొండపల్లి: ఉన్నత విద్యారంగంలో పరిశోధనలకు అందించే ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి ఫెలోషిప్ అవార్డుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని మోటాపురం విద్యార్థిని అర్హత సాధించింది. ఈఏడాది దేశవ్యాప్తంగా 23 మందిని ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల్లోమోటాపురానికి చెందిన బిక్కసాని మైత్రికి అవకాశం దక్కింది. లూథియానాలోని పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థలో ఏడాది పాటు పరిశోధన చేసిన ఆమె పశుగ్రాసంగా సాగు చేసే మొక్కజొన్నలో మేలైన వంగడాల రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ప్రధానమంత్రి ఫెలోషిప్ ద్వారా ఆమెకు నాలుగు ఏళ్ల పాటు స్కాలర్‌షిప్ అందనుంది.

సింగరేణి విజిలెన్స్ జీఎంగా ప్రసాద్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కార్పొరేట్ విజిలెన్స్ జనరల్ మేనేజర్‌గా కె.ప్రసాద్ రావు నియమితులయ్యారు. ఆప్మెయిల్ జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను విజిలెన్స్ జీఎంగా నియమిస్తూ జీఎం పర్సనల్(ఈఈ సెల్) జీఎం ఏ.కుమార్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విజిలెన్స్ జీఎంగా పనిచేసిన పిచ్చయ్యశాస్త్రి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడంతో ప్రసాద్‌రావును నియమించారు. అలాగే, ఎన్టీపీసీ జీఎం రాజశేఖర్‌ను ఆప్మెయిల్ జీఎంగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

ఎర్ర బంగారం కళకళ

- ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి
- 53,284 బస్తాలను తీసుకొచ్చిన రైతులు
- వరుస సెలవులు వస్తుండడంతో బారులుదీరిన వైనం



ఖమ్మం మార్కెట్ యార్డులు నిండిపోగా బయట వేసిన మిర్చి బస్తాలు


ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డు ఎర్రబంగారం(మిర్చి బస్తాల)తో నిండిపోయింది. యార్డులో ఎక్కడ చూసినా మిర్చి బస్తాలే కనిపించగా.. షెడ్లు సరిపోక ఆవరణలోనూ బస్తాలు వేశారు. మిర్చికి మెరుగైన ధర పలుకుతుండడానికి తోడు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉండడంతో రైతులు పంట విక్రయానికి మొగ్గు చూపారు. ఈమేరకు గురువారం అధికారిక లెక్కల ప్రకారం 53,284 బస్తాల మిర్చిని రైతులు తీసుకురాగా, క్వింటాకు గరిష్టంగా రూ. 23,800, మోడల్ ధర రూ.21 వేలు, కనిష్ట ధర రూ.17వేలుగా పలికింది. కాగా, బుధవారం క్వింటాకు రూ.23,900 గరిష్ట ధర పలకగా 40,619 బస్తాలే విక్రయానికి తీసుకున్నారు. ఈమేరకు బుధవారంతో పోలిస్తే ధర రూ.100 తగ్గింది. ఇక తాలు మిర్చి ధర కూడా అడుగు ముందకేసింది. తాలు మిర్చి గరిష్టంగా ధర రూ.15 వేలు పలకడంతో చరిత్ర సృష్టించినట్లయింది.

ఫిబ్రవరి తరహాలో..

మార్కెట్‌కు ఫిబ్రవరి రెండు, మూడో వారాల్లో అధిక మొత్తంలో మిర్చి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 13న అత్యధికంగా 60,132 బస్తాల మిర్చి రాగా.. అప్పట్లో క్వింటాకు రూ.18,150 మాత్రమే ధర పలికింది. గత నెల ఆరంభం నుంచి ధర పుంజుకోవడంతో నిత్యం 40 వేల బస్తాల మేరకు విక్రయానికి తీసుకొచ్చేవారు. కానీ గురువారం అనూహ్యంగా 53వేలకు పైగా బస్తాల మిర్చిని రైతులు తీసుకురావడం విశేషం. ఇటీవల వర్షాలతో కోతలు నిలిపేసిన రైతులు మళ్లీ మొదలుపెట్టగా, అమ్మకానికి మొగ్గు చూపుతున్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ-గోపయ్య స్వామి కల్యాణం

వైరారూరల్: వైరా మండలం దాచాపురం, గన్నవరం కూడలిలో గురువారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ -గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేశారు. కాగా, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్ల బండ లాగుడు పోటీలను ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ ప్రారంభించారు. ఈపోటీలు శుక్రవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా మహిళలకు తాడు లాగు పోటీలు, పురుషులకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై వీరప్రసాద్

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

ఇన్‌చార్జ్ డీపీఓ కేలోతు ధన్‌సింగ్



శిక్షణలో పాల్గొన్న వారితో డీపీఓ, అధికారులు

మరిపెడ రూరల్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీపీఓ కేలోతు ధన్‌సింగ్ సూచించారు. మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్-2లో భాగంగా మూడు రోజులుగా ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలకు ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయడానికి స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో అన్ని గ్రామాలు ఓడీఎఫ్‌గా ప్రకటించబడ్డాయని పేర్కొన్నారు. అనంతరం గిరిపురంలో చేపట్టిన సర్వేలో ఎంపికైన ఇంటి యజమానులు, సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛ భారత్ జిల్లా కోర్డినేటర్లు శ్రవణ్, రవికుమార్, ఎంపీఓలు పూర్ణచందర్‌రెడ్డి, హరిప్రసాద్, ఏపీఎం రాములు, కార్యదర్శులు రామకృష్ణ, లెనిన్, విక్రమం, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్



గేటుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

కారేపల్లి: సాంకేతిక లోపంతో గురువారం కారేపల్లి మండలం గాంధీపురం రైల్వేస్టేషన్ వద్ద రైల్వే గేట్‌పై గురువారం గూడ్స్ నిలిచిపోయింది. డోర్నకల్-భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) మార్గంలోని ఇల్లెందు -ఖమ్మం ప్రధాన రహదారి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో సుమారు గంటపాటు గేట్ తీయలేకపోగా, ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

కేంద్ర వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడదాం..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

చుంచుపల్లి: ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరి, వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టడమే కాక వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. చుంచుపల్లిలో గురువారం జరిగిన కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకాశాన్నంటుతున్న ధరలతో సామాన్యుడి బతుకు భారంగా మారాయని తెలిపారు. ధరలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేకపోతోందని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ, ప్రభుత్వరంగ సంస్థల భద్రత హామీలను విస్మరించారని మండిపడ్డారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా మాట్లాడుతూ బీజేపీ కో హఠావ్.. దేశ్ కో బచావ్ నినాదంతో జిల్లాలో చేపట్టనున్న ఇంటింటికీ సీపీఐ, ప్రజా పోరు యాత్ర ఈనెల 14 నుంచి చర్లలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, దుర్గరాసి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, వట్టికొండ మల్లికార్జున్ రావు, కంచర్ల జమలయ్య, జి.వీరస్వామి, కందుల భాస్కర్, బానోత్ గోవిందు, కె.రత్నకుమారి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

కల్లూరు: కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవక్షేత్రం(శివాలయం) ఆవరణలో నాలుగు జిల్లాల స్థాయి ఫొటో, వీడియోగ్రాఫర్ల క్రికెట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, జిల్లాల స్థాయి పోటీలను జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ప్రశాంతతో పాటు శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని తెలిపారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కే.హుస్సేన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవర నాగరాజు, మర్రెల నాగేశ్వరరావుతోపాటు పసుమర్తి చందర్ రావు, డాక్టర్ లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, వేముల నర్సింహారావు, చల్లా వెంకటేశ్వరరావు, వేణు, డేవిడ్, వి.తిరుమలరావు, ఎం.డీ.హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

68 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 68మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యారు. ఈ మేరకు లబ్ధిదారులకు రూ.31,58,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు అందజేసి మాట్లాడారు. జిల్లా టెలికాం సలహా మండలి(టీఏసీ) సభ్యుడు చిత్తారు సింహాద్రి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పోట్ల శ్రీను, చెరుకుమల్లి రవి, నారపోగు వెంకటేశ్వరరావు, చింతలచెర్వు లక్ష్మి, గుగులోత్ కృష్ణ, ఉపేందర్, బంధం నాగేశ్వరరావు, భాగం వెంకటేశ్వరరావు, కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, తాళ్లూరి హరీష్, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్, బొర్రా నర్సింహారావు పాల్గొన్నారు.